డాబాల్లో మద్యపానం నిషేధం
ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : డాబాలు, రెస్టారెంట్లలో మద్యం పానం నిషేధమని, అక్కడ మద్య పానాన్ని అనుమతించినా, రహస్యంగా విక్రయాలు సాగించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీలు, సీఐలు శనివారం జిల్లాలోని డాబాలు, రెస్టారెంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. వారికి. పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. డాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మద్యం మత్తులో నేరాలు జరుగుతున్న నేపథ్యంలో మద్యపానానికి అనుమతించకూడదని వారికి సూచించారు.

మత్తుగా.. నేరాలు..!

చెలరేగిపోతున్న గంజాయి ముఠాలు.. జిల్లా వ్యాప్తంగా భారీగా విక్రయాలు

ఒడిశా నుంచి వచ్చే సరుకే ఎక్కువ
క్షేత్రస్థాయిలో కొందరు పోలీసుల సహకారం
పసిగట్టి.. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యువత గంజాయికి బానిస అవుతోంది. ఒకప్పుడు ఎక్కడైన గొడవలు జరిగితే.. 'మద్యం మత్తులో' అని పోలీసులు చెప్పేవారు. ఇప్పుడు చెప్పకపోయినా.. 'గంజాయి మత్తులో' అని తేటతెల్లమౌతోంది. ఇటీవల చోటు చేసుకున్న ఘర్షణలు, హత్యలు, లైంగిక వేధింపులు, రోడ్డు ప్రమాదాలు, చోరీలకు గంజాయి మత్తే కారణమని పోలీసులే చెబుతున్నారు. మురికివాడలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, శివారు ప్రాంతాలలో సాధారణంగా గంజాయి విక్రయాలు, వినియోగం జరిగేది. ఇప్పుడు అక్కడ, ఇక్కడ అన్న తేడా లేకుండా పోయింది. చదువురానివారు, చదువుకున్నవారు, ఉద్యోగులు సైతం గంజాయి వినియోగం, విక్రయం ప్రక్రియలో భాగమౌతున్నారు. పోలీసులకు తెలియకుండా గుట్టుగా ఈ వ్యవహారం సాగడం లేదు. బహిరంగంగానే సాగుతోంది. చిన్న చిన్న గొడవలు జరిగితే.. పోలీసులు లోతుగా విచారించడం లేదు. రౌడీ షీటర్ల గొడవలను కూడా కొంత తేలిగ్గానే తీసుకుంటున్నారు. దీనికితోడు నేర చరిత్ర ఉన్నవారు రాజకీయ నాయకుల నీడలో చేరుతున్నారు. దీంతో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కోసారి అదుపులోకి తీసుకున్నా.. వదిలేస్తున్నారు. గంజాయి కట్టడికి సహకరించాల్సిన కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం తమ పంచన ఉన్నారనే కారణంగా నేరస్థులకు అండగా నిలుస్తున్నారు. ఇదే అదనుగా గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నాయి.



గుంతకల్లు పోలీసులు పట్టుకున్న ముఠా(ఫైల్)



ఇటీవల స్వాధనం చేసుకున్న 20 కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌లను చూపుతున్న జిల్లా పోలీసు ఉన్నతాధికారులు

అనంతపురం నగరంలో..

- గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందం శుక్రవారం అదుపులోకి తీసుకుంది. అతని వద్ద కిలోకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకుంది. సమగ్ర దర్యాప్తు కోసం ఓ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు.
- ఎర్రనేల కొట్టాలలో గత నెల 20న గంగమ్మ అనే మహిళ హత్యకు గురైంది. ఈ కేసులో కీలక నిందితుడు ప్రకాష్ తరచూ గంజాయి తీసుకునేవాడని పోలీసుల దర్యాప్తులో తేలింది.
- సెప్టెంబరు 11న వినాయక నిమజ్జనోత్సవంలో తేజ అనే వ్యక్తిని వంశీ అనే యువకుడిని కత్తితో పొడిచి చంపాడు. అది మద్యం మత్తులో జరిగిన ఘటనే అయినా.. నిందితుడు తరచూ గంజాయి తీసుకునేవాడని పోలీసులు గుర్తించారు
- తుని పోలీసులకు రెండు నెలల క్రితం ఓ బాలుడు గంజాయి తెస్తూ పట్టుబడ్డాడు. ఆ బాలుడు అనంతపురం నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటాడని తేలింది.

● గుత్తి ఆర్‌ఎస్‌లో..

ఈ నెల 6న ఓ రౌడీషీటర్ గంజాయి మత్తులో హల్‌చల్ చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఫిర్యాదు శారు. ఆ చర్యతో రౌడీ షీటర్ కాస్తయినా భయపడాలి. కానీ, నేరుగా ఆ మహిళ ఇంటికెళ్లి 'నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తారా..? ఎలా తిరుగుతావో చూస్తా..! చంపేస్తా..!' అని బెదిరించాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. పోలీసుల కళ్లుగప్పి అనంతపురంలో తలదాచుకున్న రౌడీ షీటర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గుత్తి ఆర్‌ఎస్‌లో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రైల్వే జంక్షన్ కావడంతో దందా బాగా సాగుతోంది. మత్తుకు అలవాటు పడ్డ యువత గొడవలకు దిగుతోంది. మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటే తప్ప తమకు రక్షణ లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● భారీగా విస్తరణ

● బెళుగుప్ప మండలం అంకంపల్లి సచివాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి బెంగళూరుకు గంజాయిని సరఫరా చేస్తూ పోలీసులకు దొరికిపోయాడు. ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అతని స్వగ్రామం గంగవరం. బెళుగుప్ప తండాలో కొందరు యువకులు నిత్యం గంజాయి మత్తులో ఉంటారని స్థానికులు అంటున్నారు. ఆ మత్తులో దొంగతనాలు చేస్తుంటారని సమాచారం. మూడు నెలల క్రితం పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడ్డారు.

● ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని ఓ వైసీపీ నాయకుడి అనుచరుడు నేతాజీని పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతానికి చెందిన దీపక్ అనే వ్యక్తి నుంచి ఇతనికి గంజాయి సరఫరా అయ్యేది. నేతాజీ నుంచి మరి కొందరికి సరఫరా అయ్యేది. గంజాయి కేసులో అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు తాజాగా 11మందిని అరెస్టు చేశారు.

● ఒడిశా నుంచి...

జిల్లాలో గంజాయి బ్యాచ్ కొన్నేళ్ల నుంచి రెచ్చిపోతోంది. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఉంటున్న వ్యక్తుల నుంచి జిల్లాకు గంజాయి సరఫరా అవుతోంది. కిలో రూ.4వేల నుంచి రూ.5వేల వరకు స్థానిక విక్రేతలకు సరఫరా చేస్తుంటారు. వాటిని జిల్లాలో చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి.. రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తుంటారు. నగరంలోని నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో కొన్ని నెలలుగా గంజాయి పట్టుబడుతూనే ఉంది. దాదాపు అన్ని కేసుల్లో పట్టుబడిన గంజాయి ఒడిశా ప్రాంతం నుంచే వస్తోందని స్పష్టమైంది. అనంతపురం నగరం సహా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో యువత గంజాయికి బానిస అవుతోంది. మత్తులో తేలుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు, దాడులకు వెనుకాడటం లేదు. తొలుత రైల్వే కేంద్రంగా ఉన్న గుంతకల్లుకు, అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా అయ్యేది.

● వినియోగం... విస్తారం..

● అనంతపురం నగరంలో బుడ్డప్ప నగర్, నవోదయ కాలనీ, చెరువుకట్ట, ప్రభుత్వాసుపత్రి వెనుకవైపు, ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, కళ్యాణదుర్గం, బళ్లారి బైపాస్ నుంచి రుద్రంపేట బైపాస్ వరకూ, అక్కడి నుంచి ఆలమూరు రోడ్డులోని ప్రైవేటు కాలేజీల వరకూ, తపోవనం సరిహద్దుల్లో గంజాయి దందా నడుస్తోంది. అంతపురం నగరంలో గంజాయి సిగరెట్లలో పెట్టి అమ్ముతుంటారని ప్రచారం ఉంది.

● తాడిపత్రిలో రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే పై ఓవర్ బ్రిడ్జి సమీపంలో గంజాయి అమ్ముతున్న నలుగురిని కొన్నిరోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు బాలలు కావడం గమనార్హం. తాడిపత్రి టైలర్స్ కాలనీ, భగత్‌సింగ్ నగర్, పోరాట కాలనీ, నంద్యాల రోడ్, శివాలయం సమీపంలోని రింగ్‌రోడ్డు, శ్రీనివాసపురం, నందపాలడు ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

● గుంతకల్లు పట్టణంలో పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా ఉన్నాయి. తాజాగా షికారీ కాలనీలో పలువురిని అరెస్టు చేశారు. ప్రశాంతి నగర్‌లోని పార్కు, కసాపురం రోడ్డులోని నల్లేని గుట్ట, ధోని ముక్కల రోడ్డులోని బ్రిడ్జి, రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయాలు ఎక్కువగా ఉన్నాయి.

● గుత్తి పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో సాధువుల ముసుగులో కొందరు గంజాయి సేవిస్తుంటారని స్థానికులు అంటున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, శింగనమల, ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ గంజాయి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

పోలీసులకు మరకలు

గంజాయి కట్టడికి పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. సరైన ఫలితాలు రావడం లేదు. గంజాయి విక్రేతలకు కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాలలో కిలోల కొద్దీ గంజాయి దొరుకుతోంది. పట్టుబడనిది, పోలీసుల సహకారంతో అమ్ముతున్నది ఇంతకు పది రెట్లు ఎక్కువగానే ఉంటుందని అంటున్నారు. గంజాయి విక్రేతల నుంచి కొన్ని ప్రాంతాలలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి అధికారి వరకూ ముడుపులు తీసుకుంటున్నారనే ప్రచారం ఉంది. ఈ మరక కొందరు పై అధికారులకూ అంటుతోంది. నెల మొత్తంలో ఒకేసారి వారికి వెళుతోందని అంటున్నారు. పై నుంచి ఒత్తిడి ఉన్నప్పుడు మాత్రమే అడపాదడపా గంజాయిని పట్టుకుని, అరెస్టులు చూపిస్తున్నారని, పూర్తి స్థాయిలో నిర్మూలనకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



గుత్తి ఆర్‌ఎస్‌లో గంజాయి బ్యాచ్ గురించి ఆరా తీస్తున్న పోలీసులు

ఎస్పీ స్పెషల్ టీం

గంజాయి కట్టడిపై ఎస్పీ జగదీష్ రెండు నెలల నుంచి దృష్టి సారించారు. ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. నేతాజీ అనే వ్యక్తి చాలాకాలంగా గంజాయి అమ్ముతున్నట్లు తెలిసినా.. రాజకీయ అండ ఉండటంతో పోలీసులు పట్టించుకోలేదు. తాజాగా ఎస్పీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందమే అతన్ని అరెస్టు చేసింది. నేతాజీని విచారిస్తే.. ముఠాలోని 11 మంది డొంక కదిలింది. వారిని అరెస్టు చేసి భారీ ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరికొందరిపైనా ప్రత్యేక బృందం నిఘా వేసింది. ఈ క్రమంలో అనంతపురంలో గంజాయి విక్రయిస్తున్న ఓ బాలుడిని శుక్రవారం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ అదుపులోకి తీసుకుని, 1.15కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నేతాజీ వద్ద రెండు కిలోల గంజాయిని రూ.20 వేలకు కొన్నట్లు బాలుడు చెప్పినట్లు సమాచారం. బాలుడు గంజాయి మత్తుకు బానిసైనట్లు గుర్తించారు.

క్యూ.. అపారం..!

హెడ్ పోస్టాఫీసు వద్ద భారీ క్యూ.. సచివాలయాల్లో అందని ఆధార్ సేవలు



పోస్టాఫీసు వద్దనే పార్సిల్స్ తెచ్చుకొని తింటున్న విద్యార్థినులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అపార్ కష్టాలు కొనసాగుతున్నాయి. బ్యాంకులు, సచివాలయాల్లో ఆధార్ సేవలను నిలిపేయడంతో అందరూ అనంతపురం నగరంలోని హెడ్ పోస్టాఫీసుకు క్యూ కడుతున్నారు. సాంకేతిక సమస్యలతో గురు, శుక్రవారాల్లో లాగిన్ బ్లాక్ అయింది. రద్దీ నేపథ్యంలో అధికారులు శనివారం ఒక్క రోజే 400 మందికి టోకన్లు ఇచ్చారు. పోస్టాఫీసు నుంచి అండర్ పాస్ బ్రిడ్జి వరకూ విద్యార్థులు, తల్లిదండ్రులు బారులు తీరారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆధార్ సేవలు కొనసాగాయి. ఆ తరువాత సమయం ముగియడంతో సేవలను ఆపేశారు. మిగిలినవారు టోకెన్లు దొరికినా నిరాశగా వెనుదిరిగారు.

క్యూలోనే భోజనం

ఆధార్ అప్‌డేట్ కోసం గంటల తరబడి క్యూలో ఉన్నవారు ఆకలితో అలమటించారు. క్యూ నుంచి పక్కకు వెళితే మళ్లీ రానివ్వరని అలాగే ఉండిపోయారు. కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డలను క్యూలో నిలబెట్టి వెళ్లి భోజనం పార్సిల్ తెచ్చి అక్కడే తినిపించారు. ఆధార్ అప్‌డేషన్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించి సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను తెరవాలని తల్లిదండ్రులు మరోమారు విన్నవించారు.



ఆధార్ కోసం పడిగాపులు

సచివాలయాల్లో బ్రేక్

జిల్లా కేంద్రంలోని 14 వార్డు సచివాలయాల్లో గతంలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశారు. కానీ నాసిరకం పరికరాలను సరఫరా చేయడంతో అవి మూలనపడ్డాయి. దీంతో సచివాలయాల్లో ఆధార్ సేవలు అందడం లేదు. అక్కడ పనిచేస్తున్న ఆపరేటర్లను ఆధార్ సేవలకు వినియోగించుకుంటే కొంతైనా సమస్య తీరుతుంది. కానీ అధికారులు వారికి బీఎల్‌ఓ విధులను అప్పగించారు.



ఎమ్మెల్యే అమిలినేనిని సత్కరించిన టెట్ క్వాలిఫైడ్ యువత

ఉద్యోగ కల్పనే లక్ష్యం: అమిలినేని

కళ్యాణదుర్గం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 20 వేల మందికి ఉద్యోగాల కల్పనే తన లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ప్రజావేదిక వద్ద టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఎమ్మెల్యేని శనివారం సత్కరించారు. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రంలో చదివిన సుమారు 500 మంది టెట్ క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లాకు డీఎస్సీ పోస్టులు ఎక్కువగా కేటాయించాలని విద్యాశాఖ మంత్రిని కోరుతామని అన్నారు. వైఎస్ జగన్ సోషల్ మీడియా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. జగన్ అక్రమాలు, అవినీతి, తప్పిదాల కారణంగా రాష్ట్రానికి అన్యాయం జరిగిందని అన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: కాంగ్రెస్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ క్లాక్‌టవర్ సమీపంలోని శనివారం నిరసన తెలిపారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు గెలిపించారని, ఐదు నెలల్లోనే ప్రజల నడ్డి విరిచేలా చార్జీలు పెంచారని వారు విమర్శించారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం మోపడం తగదని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు చేసిన చంద్రబాబు.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందని అప్పట్లో ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రజలపై భారం వేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు శివశంకర్ యాదవ్, ఇమామ్ పాల్గొన్నారు.

అహుడా చైర్మన్‌గా టీసీ వరుణ్



ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్‌గా జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు

(వివరాలు 7లో...)

విజయవాడలో
కొనుగోలు చేయండి
మాజీ ఎమ్మెల్యే మధుసూదన్



చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్

గుంతకల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వినియోగదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి సరుకును కొనే అలవాటును మానుకోవాలని, విజయవాడకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ సూచించారు. పట్టణంలోని వాసవీ కళ్యాణ మండలంలో ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా చైర్మన్ గోపా జగదీశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మధుసూదన్ పాల్గొని ప్రసంగించారు. దుస్తులు, కార్లు, ఆభరణాల కొనుగోలుకు రాష్ట్ర ప్రజలు హైదరాబాదుకు, బెంగళూరుకు వెళ్లే అలవాటును మానుకోవాలని అన్నారు. విజయవాడలో కొనుగోలు చేసి.. రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని అన్నారు. జీఎస్టీ విధానం వల్ల వ్యాపారులకు, ప్రజలకు మేలు జరిగిందని అన్నారు. వ్యాపారుల సమస్యలను చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కల గడ్డ, భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు, జిల్లా చైర్మన్ గోపా జగదీశ్, నాయకులు విజయకుమార్ రెడ్డి, కృపాకర్, మేడం వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు తులసీదళ అలంకరణ



తులసీ దళాల అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నేమకల్లు ఆంజనేయస్వామి వారికి శనివారం లక్ష తులసి దళాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు, సంతోష్ కుమార్ చార్యులు వేకువ జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, విష్ణు పారాయణం తదితర పూజలు జరిపించారు. అనంతరం లక్ష తులసీ దళాలతో అలంకరించారు. నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు శ్రీధరఘట్టకు చెందిన టీడీపీ నాయకడు ఎర్రిస్వామి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈట నరసింహారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ తిప్పేస్వామి, మాజీ ధర్మకర్తలు కాశీనాథ్‌శెట్టి, శాంతయ్య తదితరలు పాల్గొన్నారు.

సూర్యకాంతిని సద్వినియోగం చేసుకోవాలి
కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



సోలార్ ప్యానల్ పనితీరును తెలుసుకుంటున్న కలెక్టర్

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ప్రతి నీటి చుక్కను, సూర్యకాంతిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ మేళా నిర్వహించారు. జిల్లా విద్యుత్తుల నిర్వహణ శాఖ అధికారి సంపత్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం అమలులో జిల్లాను దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆగస్టులో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఈ పథకం గురించి చెప్పారని అన్నారు. అధికారులు, బ్యాంకర్లు, విద్యుత్ వినియోగదారులు ఈ పథకం గురించి అవగాహన పెంచుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవాలని సూచించారు. జిల్లాకు పవర్ గ్రిడ్, సోలార్ పార్క్‌లు రాబోతున్నాయని అన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ కౌంటర్లను ప్రారంభించారు. వాటి పనితీరు, వినియోగం గురించి విక్రయదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ వరప్రసాద్, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈలు జేవీ రమేష్, రాజశేఖర్, శేషాద్రి శేఖర్, ప్రసాద్, డీఈఈలు రామకృష్ణ, శ్రీనివాసులు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.



చికిత్సలు చేయించడానికి వృద్ధుడిని ఆసుపత్రికి తెచ్చిన అవినాశ్

అవినాశ్ నిర్వహిస్తున్న హోటల్



గుంతకల్లు పట్టణంలో బజ్జీల దుకాణం నడిపే కే అవినాశ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ద్వారా దూసుకుపోతున్నాడు. తన రీల్స్ ద్వారా అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు పొందాడు. నాలుగు నెలల్లోనే 22 వేల మంది ఫాలోయర్స్‌ను సమకూర్చుకున్నాడు. స్థానికంగా చానల్‌కు గుర్తింపు రావడంతో యాడ్ ప్రమోషన్స్ వెతుక్కుంటూ వచ్చాయి. స్థానిక వ్యాపారాలను తన ఇన్‌స్టాగ్రాం చానల్‌లో ప్రమోట్ చేస్తూ ఒక నిమిషం వీడియోకు రూ. వెయ్యి నుంచి రూ. 1,500ల వరకూ ఆదాయం పొందుతున్నాడు. ఇలా వచ్చిన డబ్బును స్నేహితులతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాడు. ఇతడి అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు కల్పించిన ఆటంకాలను అధిగమించి విజయవంతంగా ముందుకు దూసుకుపోతున్నాడు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు


ఇన్‌స్టాగ్రాంలో వీడియోలతో గుర్తింపు

ఇన్‌స్టాంట్ సెలబ్రిటీ..!



హోటల్‌ను నిర్వహిస్తున్న అవినాశ్

- రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌తో ఫేం
- పెరుగుతున్న యాడ్ ప్రమోషన్, రెవెన్యూ
- వచ్చిన డబ్బుతో సామాజిక సేవా కార్యక్రమాలు
- రియల్‌స్టార్‌గా మారిన గుంతకల్లు యువకుడు



ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్ హోం పేజ్

స్థానిక ధర్మవరం గేటు పక్కన బజ్జీల షాపును నిర్వహిస్తున్న అవినాశ్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో పనిచేస్తూ నటన పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. 2018లోనే షార్ట్ ఫిలింస్ రూపొందించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. కానీ పెద్దగా ఆదరణ పొందలేదు. అయినా అడపాదడపా యూట్యూబ్‌లో రీల్స్ చేసేవాడు. ఈక్రమంలోనే ఈ సంవత్సరం జూలైలో ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌ను

రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌తో..

ప్రారంభించి రీల్స్ చేయడం ప్రారంభించాడు. అతి తక్కువ కాలంలోనే ఫాలోయర్స్ భారీగా పెరిగారు. నాలుగు నెలల్లోనే 22 వేల పైచిలుకు ఫాలోయర్స్‌ను కూడగట్టుకున్నాడు. ఇతడు అప్‌లోడ్ చేసిన పలు వీడియోలు మిలియన్ వ్యూస్ దాటి ఆదరణ పొందాయి. ఏ వీడియో అప్‌లోడ్ చేసినా సగటున 40 వేల వ్యూస్ వస్తుండటంతో తమ షాపు, వ్యాపారాల ప్రమోషన్ చేయాలంటూ ఇతడికి అభ్యర్థనలు ప్రారంభమయ్యా యి. ప్రస్తుతం ప్రతి రోజూ కనీసం రెండు, మూడు యాడ్ ప్రమోషన్ చేస్తున్నాడు. నాలుగు నెలల్లోనే దాదాపు 400 యాడ్ ప్రమోషన్స్ చేశానని ఇతడు తెలియజేశాడు.

ఇన్‌స్టాగ్రాంలో చానల్ మోనిటైజేషన్‌కు దరఖాస్తు చేసుకోకమునుపే యాడ్ ప్రమోషన్ ద్వారా డబ్బు వస్తుండటంతో అవినాశ్ వృద్ధులు, అనాథలకు సేవా కార్యక్రమాలు ప్రారంభించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యాచకుడికి గాయమై చాలా దుర్భర స్థితిలో రైల్వే ఏరియాలో పడి ఉండగా స్నేహితుల సాయంతో అనంతపురం తీసు

ఇన్‌స్టా ఆదాయంతో సేవా కార్యక్రమాలు

కెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించాడు. మరలా గుంతకల్లుకు తెచ్చి ఇక్కడి ఆసుపత్రిలో రెండు, మూడు రోజులకోసారి డ్రెస్సింగ్ చేయిస్తున్నాడు. ఆ కార్యక్రమాలను కూడా రీల్స్‌గా చేయడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు కొందరు సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా ఇతడికి ప్రజాదరణ లభించి, చానల్ వేగంగా వృద్ధిలోకి వచ్చింది.

చానల్ హ్యాక్

అతి తక్కువ కాలంలోనే చానల్ వృద్ధి చెందడం, ప్రజాదరణ పొందడాన్ని చూసి ఓర్వలేని కొందరు తన వీడియోలకు దుర్భాషలతో కామెంట్స్ పెట్టారని అవినాశ్ ఆవేదనను వ్యక్తంచేశాడు. కొందరు ఫాలోయర్స్ తనకు మద్దతుగా కామెంట్స్ పెడితే వారి కుటుంబ సభ్యులను కూడా తిడుతూ పోస్టులు పెట్టి వేధించారన్నాడు. నెలన్నర కిందట తన చానల్‌ను హ్యాక్‌చేసి దాదాపు 70 వీడియోలను డిలీట్ చేశారన్నాడు. చానల్‌లో 20 రోజుల పాటు తాను వీడియోలను అప్‌లోడ్ చేయలేకపోయానని అవినాశ్ తెలిపాడు. తన చానల్ హ్యాక్ అయ్యిందని తెలుసుకున్న ఓ టెకీ అయిన ఫాలోయర్ గుంతకల్లుకు వచ్చి, తన చానల్‌ను రికవరీ చేసి ఇచ్చాడన్నాడు. దుర్భాషలాడుతున్న వ్యక్తులు స్థానికులని తెలిసి పోలీసులకు ఫిర్యాదుచేస్తే వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని వెల్లడించారు. తర్వాత చానల్‌లో దుర్భాషలు ఆగిపోయాయని అవినాశ్ తెలిపాడు. త్వరలో తన ఇన్‌స్టాగాం చానల్ మోనిటైజేషన్ అవుతుందని, ఇవే రీల్స్‌ను యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో కూడా పోస్ట్ చేస్తానని అవినాశ్ తెలిపాడు.



రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌లో అవినాశ్ చేసిన రీల్స్

ముగ్గురు గురువులకు రాష్ట్రస్థాయి పురస్కారం

ఇద్దరు ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లకు, ఉర్దూ ఎస్‌జీటీకి

11న సీఎం చేతుల మీదుగా అవార్డు



రమేష్‌బాబు



మహమ్మద్ యాకూబ్

అనంతపురం విద్య, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముగ్గురిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. ఇందులో అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ స్కూల్‌లో పని చేసిన ఇం గ్లిష్ టీచర్ పోలమడ రమేష్‌బాబు, ఆత్మకూరు జడ్పీహైస్కూల్ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ గండబత్తుల సుజాత, ఉర్దూ ఎస్‌జీటీ మహమ్మద్ యాకూబ్ ఉన్నారు. వీరు ఈ నెల 11న విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.



రాష్ట్ర స్థాయిలో జరిగిన ట్రైనింగ్‌లో యాకూబ్

ఉర్దూ సేవలో టీచర్ యాకూబ్

బెస్ట్ ఉర్దూ టీచర్‌గా ఎంపికైన మహమ్మద్ యాకూబ్ 2012 డీఎస్సీలో ఉద్యోగం పొందారు. తొలిగా లేపాక్షి ఎంపీపీ ఉర్దూ బాలికల పాఠశాలలో ఉర్దూ ఎస్‌జీటీగా విధుల్లో చేశారు. తర్వాత బదిలీల్లో భాగంగా 2021లో ఎన్పీకుంట మండలం పెడబల్లి స్కూల్‌కు వచ్చారు. తాను పనిచేసిన స్కూళ్లలో ఉర్దూ భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తూ వచ్చారు. అనంతరం 2023లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో గార్లదిన్నె మండలం పీడబ్ల్యూడీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌కు ఎస్‌జీటీ ఉర్దూ టీచర్‌గా వచ్చారు. సుమారు ఏడాదిగా అక్కడే పనిచేస్తున్నారు. 2017లో హజ్ అసిస్టెంట్‌గా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగా హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు మక్కాలో ఉండి సుమారు రెండున్నర నెలలు సహాయ సహకారాలు అందించారు. 2021 నుంచి అమల్లోకి వచ్చిన 1వ తరగతి ఉర్దూ పుస్తకం రచయితగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, స్టేట్ సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలు చోట్ల స్టేట్ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలుశిక్షణా కార్యక్రమాల్లో భాగస్వామిగా మారి ఉర్దూ టీచర్లకు శిక్షణ అందించారు.

చాలా ఆనందంగా ఉంది

ఉర్దూ భాషకు సేవలు అందించినందుకు ఏపీ ఉర్దూ అకాడమీ నుంచి స్టేట్ బెస్ట్ ఉర్దూ టీచర్‌గా అవార్డు రావడం ఆనందంగా ఉంది. గతంలో నేను ఏనాడూ అవార్డు కోసం దరఖాస్తు చేయలేదు. నా వంతుగా ఉర్దూ భాష కోసం కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నా. ఈ ఏడాది తొలిసారి దరఖాస్తు చేశా. అవార్డు రావడం ఆనందంగా ఉంది.

- మహమ్మద్ యాకూబ్

• విభిన్న బోధనా పద్ధతుల కంచుకంఠం రమేష్‌బాబు



ప్రధానోపాధ్యాయుల ట్రైనింగ్‌లో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న రమేష్‌బాబు

పోలమడ రమేష్‌బాబు అనంతపురం కార్పొరేషన్ స్కూళ్లలో పరిచయం అక్కరలేనివ్యక్తి. టీచర్‌గా ఎంతగా ప్రాచుర్యం పొందారో...అదే స్థాయిలో పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా తన కంచుకంఠంతో గుర్తింపు పొందారు. 1989లో ఎస్‌జీటీగా ఎంపికై, యల్లనూరు మండలం లింగారెడ్డిపల్లిలో తొలిపోస్టింగ్ పొందారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. 35 ఏళ్ల సర్వీసులో విభిన్న బోధనా పద్ధతులతో విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా పాఠాలు బోధించారు. ఈయన ఇంగ్లిష్ భాషపై రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షకులుగా పనిచేశారు. ఎంఈఓ, డైట్ కాలేజ్ అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయుల శిక్షణ, సచివాలయ ఉద్యోగుల శిక్షణ ఇలా అనేక కార్యక్రమాల్లో ఉత్తమ శిక్షకుడిగా సేవలందించారు. పదో తరగతి నమూనా పత్రాల ముద్రణ, డీసీఈబీ ద్వారా టెన్త్ విద్యార్థులకు అందించే అనంత సంకల్పం పుస్తకాల రూపకల్పనలో ఇంగ్లిష్ పాఠ్యాంశాలపై తనదైన ముద్ర వేశారు. జిల్లాలో మూడుసార్లు కలెక్టర్ నుంచి, ఒక సారి డీఈఓ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

చిత్తశుద్ధితో పనిచేసినందుకే..

నేను 1989 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా. నిజాయతీ, చిత్తశుద్ధి, అంకితభావంతో పిల్లలకు బోధించా. నా సేవ, ప్రతిభను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చినందుకు సంతోషంగా ఉంది. నా ఉపాధ్యాయ వృత్తి ప్రయాణంలో నా సతీమణి, తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ఇచ్చిన సహకారం మరువలేనిది. నాకు శక్తి ఉన్నంత వరకూ ఒక గురువుగా సమాజానికి సేవలు అందిస్తూనే ఉంటా. - రమేష్‌బాబు

కొండ నాలుకకు మందేస్తే..!

- తెగులు నివారణకు రసాయన మందు పిచికారీ
- మొత్తం ఎండిపోయిన బీర పంట
- ఎరువుల దుకాణం నిర్వాహకుడి సూచనతోనే...
- తీవ్రంగా నష్టపోయామంటున్న కక్కలపల్లి రైతులు





దెబ్బతిన్న బీర తోట, ఎండిపోయిన విధంగా మారిపోయిన బీర ఆకులు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటకు తెగులు సోకిందని పురుగు మందులు పిచికారీ చేస్తే ఉన్న పంట మొత్తం దెబ్బతిని రైతులు లబోదిబోమంటున్నారు. రూరల్ మండలంలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతుల విషయంలోను ఇదే జరిగింది. పురుగు మందుల దుకాణం యాజమానుల నిర్వాకంతో తమకు నష్టం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు.

రూ.లక్షల పెట్టుబడి నాశనం



దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు శేఖర్‌రెడ్డి

మండలంలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతులు శేఖర్‌రెడ్డి, రాజేంద్ర గ్రామ సమీపంలో రెండున్నర ఎకరాల్లో నెల రోజుల కిందట బీర పంట సాగు చేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.2.7లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట పిందె, కాయదశలో ఉంది. అన్ని సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికి పంట కొంత కోత పడేది. అయితే పంటలో తెగుళ్లు కనిపించడం వాటి నివారణ కోసం ఈ నెల 4న రుద్రంపేట సమీపంలోని ఓ ఎరువుల దుకాణంలో పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేశారు. ఆ మరుసటి రోజు నుంచే బీర తీగ ఆకులు వాడి ఎండిపోవడం ప్రారంభమైంది. బీర పిందెల పరిస్థితి కూడా ఇలాగే ఉండటంతో ఆందోళన చెందిన రైతులు తాము పురుగుమందులు కొనుగోలు చేసిన దుకాణం వద్దకు వెళ్లారు. నిర్వాహకుడికి విషయం వివరించారు. దీంతో ఆయన తోటను పరిశీలించాడు. మందు మోతాదు ఎక్కువైంది. ఏంకాదు అని చెప్పివెళ్లిపోయాడు. అయితే రోజురోజుకు పంట మరింతగా దెబ్బతింది. ఎరువుల దుకాణ నిర్వాహకుడి కారణంగానే తమకు ఈ పరిస్థితి దాపురించిందంటూ ఆ ఇద్దరు రైతులు వాపోతున్నారు.

ముంచిన ఎరువుల దుకాణం నిర్వాహకుడి సూచనలు



కాపుకొచ్చిన బీర కాయలను చూపుతున్నరైతు రాజేంద్ర

ఎరువుల దుకాణం నిర్వహకుడి సూచనలే తమను ముంచాయని రైతులు చెబుతున్నారు. వాస్తవానికి దుకాణం నిర్వహకుడు ఇచ్చిన పురుగు మందులు దాదాపు వెయ్యి లీటర్ల నీటిలో కలిపి కొట్టాలని పంట పరిస్థితిని చూసిన వారు అంటున్నారు. అయితే 450లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని దుకాణం నిర్వాహకుడు చెప్పడం.. ఆమేరకు తాము మందు పిచికారి చేయడంతో తమకు ఈ పరిస్థితి ఎదురైందని వాపోయారు. మందుల్లో కాపర్ శాతం ఎక్కువగా ఉండటంతో పంట దెబ్బతినట్లు తెలిపారు. మందు పిచికారీ చేసిన తరువాత ఎండిపోతున్న పంటకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడీ పరిస్థితి ఉండేది కాదని ఆ రైతులు వాపోతున్నారు. అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

జేఎన్‌టీయూలో ముగ్గురు బెస్ట్ ప్రొఫెసర్స్

బెస్ట్ ప్రొఫెసర్లుగా ఎంపికైన వైశాలి గోర్పడే, చెన్నారెడ్డి, బెహర దిలీప్ కుమార్







అనంతపురం సెంట్రల్, నవబంబరు 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బెస్ట్ ప్రొఫెసర్లుగా ముగ్గురు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అవార్డుల జాబితాను శనివారం ప్రకటించింది. జనరల్ పబ్లికేషన్స్, ప్రాజెక్టులు, పేటెంట్లు, అవార్డులు ఇలా 22 అంశాల్లో ప్రతిభ కల్గిన ప్రొఫెసర్లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వైశాలి గోర్పడే, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ బెహర దిలీప్ కుమార్ ఉత్తమ అవార్డులకు ఎంపియ్యారు. వీరిని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్యతో పాలు పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఇక నుంచి మూడు రోజులు

మంగళ, గురు, శుక్రవారాల్లో పింఛన్లకు మెడికల్ సర్టిఫికెట్లు

అనంతపురం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను ఇక నుంచి వారానికి మూడురోజులు జారీ చేస్తామని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వ రరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఇంతకుమునుపు వారంలో రెండు రోజులు మాత్రమే సర్టిఫికెట్లు ఇచ్చేవారన్నారు. అయితే అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలకు చెందిన వారందరికి ఇక్కడే సరిఫికెట్లు ఇస్తుండటంతో రద్దీ పెరిగిందన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఇకనుంచి వారంలో మంగళ, గురు, శుక్రవారాల్లో డాక్టర్లు పింఛన్ కోసం అర్హులను పరిశీలిస్తారన్నారు.

ఈ రోగాలు ఉన్నవారికే...

తలసేమియా, సికిల్‌సెల్‌అనీమియా, హిమోఫిలియా, పక్షవాతంతో బాధ పడుతూ కుర్చీకే పరిమితమైనవారికి, కండరాల బలహీనత, వెన్నెముక బాధితులు చక్రాలకుర్చీ లేదా మంచాలకే పరిమితమైనోళ్లకు, దీర్ఘకాలికంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వారికి, కాలేయం, గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్నవారిని ఆమూడు రోజులు సంబంధిత డాక్టర్లు పరిశీలించి నిర్ధారిస్తారన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా వ్యాధులకు సంబంధించిన బాధితులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని అక్కడే ఆయా డాక్టర్లు వైద్యపరీక్షలు, వ్యాధి ఆపరేషన్ల సర్టిఫికెట్లు పరిశీలిస్తారన్నారు. ఆయా రోజులలో ఉదయం 9గంటల నుంచి 1గంట వరకు రిజిస్ట్రేషన్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు డాక్టర్లు పరిశీలించడం ఉంటుందన్నారు. తొమ్మిది రకాల వ్యాధులకు సంబంధించి రోజుకు వంద ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం

జిల్లా అధ్యక్షుడి ఎంపిక



కటిక జయరాం

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు కటిక జయరాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల కిందట కడపలో యూనియన్ రాయలసీమ ప్రాంతీయ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు అనంతపురం జిల్లా అడ్‌హక్ కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఆయన పేర్కొన్నారు. తనతో పాటు ప్రధాన కార్యదర్శిగా బొజ్జ నాయక్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, కోశాధికారిగా శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీగా ఇబ్రహీం, ప్రచార కార్యదర్శి రమేష్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, వెంకటరమణప్ప, ముత్యాలమ్మ, మల్లికార్జులను ఎంపిక చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

రామాంజినమ్మది హత్యే..?

- గతనెల 18న ఆమె అదృశ్యం
- పోలీసులు అదుపులో ముగ్గురు
- ఇంటి సమీపంలోనే చెత్తకుప్ప కింద మృతదేహం
- పరిచయమున్న వ్యక్తే నిందితుల్లో ఒకడు



రామాంజినమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో అటెండర్‌గా పనిచేస్తూ గత నెల 18న కనిపించకుండా పోయిన రామాంజినమ్మ హత్యకు గురైంది. నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసముంటున్న రామాంజినమ్మ గత నెల 17న విధులకు హాజరైంది. 18న ఉదయం ఆమె హత్యకు గురైనట్లు సమాచారం. ఆమె అదృశ్యంపై తొలుత అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. నాలుగు రోజుల కిందట ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

ఉదయం చంపి...

విశ్వసనీయ సమాచారం మేరకు... రామాంజినమ్మ ఉంటున్న ఇంటి ఎదురుగా గత కొంత కాలం ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ నిర్మాణ పనికి వచ్చే ఓ యువకుడితో రామాంజినమ్మకు పరిచయమైంది. అది చనువుగా మారి సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ యువకుడు మరో యువకుడితో కలిసి ఈ నెల 18న ఉదయం రామాంజినమ్మ ఇంట్లోకి వెళ్లారు. ఇద్దరూ ఆమెపై దాడి చేసినట్లు తెలిసింది. సుత్తితో కొట్టడంతో మృతి చెందింది. తర్వాత బీరువాలో ఉన్న బంగారం నగలు, రూ.40వేలు తీసుకుని వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో వచ్చి మృతదేహాన్ని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సీసీ కెమెరాలు పగలకొట్టారు. మృతదేహాన్ని ఆమె ఇంటి సమీపంలో ఓపెన్ ప్లేస్‌లో ఉన్న ఓ చెత్త కుప్పలో దాచిపెట్టారు. పైన రెండు బండరాళ్లు ఉంచారు. రామాంజినమ్మ అదృశ్యంపై కేసు నమోదు కావడంతో పోలీస్ బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఆమె ఇంటి సమీపంలోనే దుర్వాసన రావడంతో వెతకగా రామాంజినమ్మ మృతదేహం లభించినట్లు సమాచారం.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

పుట్టపర్తి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్, పూర్తి చేసిన విద్యార్థులు జర్మనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలతో ప్రాథమిక పరీక్ష ఉంటుందన్నారు. బయోడేటా, విద్యార్హతలు, పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్లు, వివాహ ధ్రువీకరణ పత్రం, కొవిడ్ ఎంఎంఆర్ సర్టిఫికెట్‌ జత పరచాలన్నారు. జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.24వేల నుంచి రూ.35వేల వరకు జీతం లభించవచ్చని, గుంటూరులో ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వీసా ఫీజు, రానుపోను విమాన టికెట్లు, సీయూఆర్‌పీ ఆర్థిక సహకారం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు కాల్ సెంటర్ 9988853335 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

న్యూస్‌బాక్స్

రాయితీ పాస్‌ల కోసం సంప్రదించండి

రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ



అనంతపురం న్యూటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే రాయితీ పాసుల కోసం సోమవారం రైల్వే స్టేషన్‌లోని చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తగిన అర్హత, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే వాటిని ఉన్నతాధికారులకు పంపి అర్హులైన వా రందరికి రాయితీ కల్పిస్తామన్నారు. రా యితీకి అర్హులైన దరఖాస్తుదారుల ఫోన్‌కు సమాచారం వస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో కూడా పరిశీలించుకోవచ్చన్నారు. మి గిలిన రోజుల్లో జిల్లాలోని ఇతర స్టేషన్లలో పరిశీలనకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

టమోటా కిలో రూ. 23

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ. 16, కనిష్ఠ ధర రూ. 10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.30వేలు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30వేలు పలికి నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 24వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 86 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 975 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్-2కు 1027 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపు మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లాక్ టవర్ వద్దనున్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహానికి సోమవారం ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం జడ్పీలోని మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన జన్మదిన వేడుకలు నిర్వహిస్తామన్నారు.

కొర్రపాడులో ఘర్షణ

ఎనిమిది మందికి గాయాలు

బుక్కరాయసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడులో రస్తా విషయంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గ్రామంలో తలారీ నాగభూషణం, తలారీ పరమేశ్ మధ్య భూముల రస్తా విషయంలో వివాదం ఉంది. గతంలో గొడవల కారణంగా ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయి. తాజాగా మరోమారు గొడవపడ్డారు. ఇరువర్గాలవారు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఒక వర్గానికి చెందిన తలారీ నాగభూషణం, అతని బంధువు చిన్న ఎర్రిస్వామి, అలివేలమ్మ, నాగేంద్ర, మరో వర్గానికి చెందిన తలారి పరమేశ్, అతని బంధువు ఆనంద్, మునీశ్వరీ, కార్తీక్ గాయపడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గాయపడిన వారు అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నగరంలో రైతు ఆత్మహత్య



అనంతపురం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన రైతు చెన్నకోట నరసింహులు (51) శనివారం రాత్రి నగరంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... నరసింహులు శనివారం సాయంత్రం అరవింద నగర్ బ్రిడ్జి వద్ద పడిపోయి ఉన్నాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఊజీమాత్రలు మింగినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఐదెకరాల పొలం ఉంది. మరి కొంత భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. ఈ క్రమంలో అప్పులు చేసినట్లు సమాచారం. తాజాగా టమోట పంటలోనూ నష్టం రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాశలో తెలుగు తమ్ముళ్లు...!

రెండో జాబితాలోనూ పదవులు దక్కకపోవడంతో అసంతృప్తి

అహుడా చైర్మన్‌గా జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్

ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్‌గా జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, నామినేటెడ్ పదవుల ఆశించిన కొందరు టీడీపీ ముఖ్య నాయకులకు శనివారం విడుదల చేసిన నామినేటెడ్ చైర్మన్ల జాబితా నిరుత్సాహం కలిగించింది. తొలిజాబితాతో పాటు రెండో జాబితాలోనూ నిరాశే ఎదురుకావడంతో తెలుగు తమ్ముళ్లలో నిర్వేదం నిండుకుంది. తొలి జాబితాలో రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి సీడాప్ చైర్మన్ పదవి ఇచ్చారు. మరో నలుగురు డైరెక్టర్లతో సరిపెట్టారు. రెండో జాబితాలో ఎక్కువ మందికి నామినేటెడ్ పదవులు దక్కుతాయనే ఆశ తెలుగు తమ్ముళ్లల్లో ఉండేది. దాదాపు నెలన్నర కసరత్తు తర్వాత విడుదల చేసిన రెండో జాబితాలో కేవలం టీడీపీలో ఒక్కరికి, జనసేన తరఫున మరొకరికి చైర్మన్ పదవులు దక్కాయి.



దీంతో నామినేటెడ్ పదవులు ఆశించిన నాయకులకు రెండో జాబితా నిరాశనే మిగిల్చింది.

ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా పూల నాగరాజు



తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ వాల్మీకి, బోయ సా ధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజుకు కడప ఆ ర్టీసీ రీజనల్ చైర్మన్ పదవి ల భించింది. రాయదుర్గం ని యోజక వర్గానికి చెందిన ఆయన సుదీర్ఘకాలంగా టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో జడ్పీ చైర్మన్‌గా మొదటి మూడేళ్లు చమన్ సాబ్ పనిచేయగా... ఆ తర్వా త రెండేళ్లు పూల నాగరాజు పనిచేశారు. సామాజిక కోణంలో భాగంగానే పూల నాగరాజుకు నామినేటెడ్ పదవి దక్కినట్లు తెలుస్తోంది.

అహుడా చైర్మన్‌గా టీసీ వరుణ్



జనసేన జిల్లా అధ్యక్షుడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న టీసీ వరుణ్‌కు జనసేన పక్షాన అహుడా చైర్మన్ పదవి దక్కింది. జనసేన ఆవిర్భావం నుంచి టీసీ వరుణ్ పార్టీ కోసం పనిచేస్తున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే కూటమి పొత్తులో భాగంగా ఆ అవకాశం వరుణ్‌కు దక్కలేదు. టీడీపీ అభ్యర్థి విజయం కోసం పనిచేశారు. దీంతో పాటు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుటుంబానికి సన్నిహితుడు కావడంతో వరుణ్‌ను నామినేటెడ్ పదవి వరించింది.

మూడో జాబితాపైనే ఆశలన్నీ..

తొలి రెండు జాబితాల్లో నామినేటెడ్ పదవులు దక్కక తీవ్ర అసంతృప్తి, నిరాశకు లోనైన ఆశావహులు మూడో జాబితాపై ఆశలు పెట్టుకున్నారు. సుదీర్ఘకాలం పాటు పార్టీ కోసం పనిచేస్తున్న కొందరు ముఖ్యనాయకులకు నామినేటెడ్ పదవులు దక్కుతాయని వారి వర్గీయులు భావించారు. అయితే అది సాధ్యం కాలేదు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంలో కీలకంగా వ్యవహరించిన నాయకులు కొందరు నామినేటెడ్ పదవులు దక్కుతాయని ఆశించారు. అది సాధ్యం కాకపోవడంతో మూడో జాబితాలో నైనా అవకాశం కల్పిస్తారనే ఆశాభావంలో ఉన్నారు. ఇప్పటి వరకు మొదటి, రెండు జాబితాల్లో 70కిపైగా నామినేటెడ్ పదవులు భర్తీ చేశారు. మరో 70కిపైగా పదవులు భర్తీ చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో ఆశావహులందరూ మూడో జాబితా కోసం ఎదురు చూస్తున్నారు.

క్రైంకార్నర్

బావిలో గల్లంతైన కూలీ మృతి

24 గంటలు శ్రమించిన అధికార యంత్రాంగం

మృతదేహం వెలికితీత



రామాంజనేయులు (ఫైల్)

ధర్మవరంరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాడైపోయిన మోటారును తీసేందుకు బావిలోకి దిగి గల్లంతైన రైతుకూలీ మృతి చెందిన సంఘటన విషాదంగా ముగిసింది. కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన రైతు కూలీ దాసరి రామాంజనేయులు (44) ధర్మవరం మండలం కట్టకిందపల్లి వద్ద పాడైపోయిన మోటర్‌ను తీసేందుకు బావిలోకి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. బావిలో ఎక్కువగా నీరు ఉండటంతో రామాంజనేయులు ఆచూకీ లభించలేదు. రెస్క్యూ టీం, రెవిన్యూ, అగ్నిమాపక సిబ్బంది స్థానిక ప్రజల సహాయంతో ముమ్మరంగా గాలించారు. అధిక నీళ్లు ఉండటంతో మోటార్లు బిగించి బయటకు తోడారు. రాత్రి కావడంతో లైట్లు వేసి గాలించారు. అయినప్పటికీ నీళ్ల తగ్గుముఖం పట్టకపోవడంతో శనివారం ఉదయం మరిన్ని మోటార్లు తెప్పించి తోడేశారు. దాదాపు 24గంటల పాటుఅధికార యంత్రాంగం శ్రమించి బావిలో ఉన్న రామాంజనేయులు మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కళావతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామాంజనేయులు బావిలో పడ్డాడని తెలుసుకున్న ముక్తాపురం గ్రామస్థులతో కాక చుట్టుపక్కన గ్రామాల ప్రజలు పెద్దఎత్తున సంఘటన స్థలం వద్దకు చేరుకుని రెండురోజులుగా అక్కడే ఉన్నారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కుటుంబీకులు, బంధువులతో పాటు అక్కడున్న వారు రోదనలు మిన్నంటాయి.

యుద్ధప్రాతిపదికన చర్యలు

రైతుకూలి రామాంజనేయులు బావిలో మునిగిపోయాడన్న విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చి బయటకు తీసేందుకు అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే కలెక్టర్, రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్డీఓ మహేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ శ్రీనివాసులు, అగ్నిమాపక అధికారులు 24గంటల పాటు శ్రమించి రామాంజనేయులు మృతదేహాన్ని వెలికితీశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

11 నెలల తర్వాత మృతుడి వివరాలు లభ్యం

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి ఆచూకీ దాదాపు 11 నెలలు తరువాత లభ్యమైంది. వేలిముద్రల నిపుణుల పరిశీలన తరువాత మృతుడి పూర్తి వివరాలు లభ్యమైనట్టు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత ఏడాది డిసెంబరు 28న ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కిందపడి మృతిచెందాడు. అప్పట్లో ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆ సందర్భంగా మృతుడి వేలిముద్రలు తీసుకుని నిపుణులకు పంపారు. దాదాపు 11 నెలల తరువాత శుక్రవారం మృతుడి వివరాలు నిపుణుల ద్వారా తెలిశాయి. కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన నాగరాజు(38)అని తేలిందన్నారు. అతడు కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌లో 2008లో ఓ హత్య కేసులో ముద్దాయి అని, శిక్షను అనుభవించి జైలు నుంచి బయటకు వచ్చి ధర్మవరం చుట్టు పక్కల బేల్దారి పనులు చేసుకుంటూ జీవనంసాగించేవాడని రైల్వే హెచ్‌సీ తెలిపారు. 2022లో మృతుడి కుమారుడు అంజనేయులు కూడా జంగాలపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో రైలుకిందపడి మృతి చెందాడు. దీంతో నాగరాజు ఒంటరి జీవితాన్ని భరించలేక గత ఏడాది ధర్మవరం డీఎల్ఆర్ కాలనీ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి తల్లి రామాంజినమ్మ, తమ్ముడు రామచంద్ర తెలిపారన్నారు.



నాగరాజు(ఫైల్)

దొంగ అల్లుడు..!

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్టు.. 6.5 తులాల బంగారం నగల స్వాధీనం

ధర్మవరం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో బంగారం నగలు చోరీ కేసులో ఇంటి అల్లుడే దొంగ అని పోలీసులు నిర్ధారించారు. శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు చోరీ కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న గొట్లూరు గ్రామంలో సాకే ఓబులమ్మ ఇంటితాళాలు పగలగొట్టి 6.5 తులాల బంగారు నగలను చోరీ చేశారని తెలిపారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టగా ఇంటి అల్లుడే దొంగ అని విచారణలో తేలిందన్నారు. నిందితుడు చందమామ రవి ధర్మవరం పట్టణం ఇందిరమ్మకాలనీకి చెందిన వాడని, ఓబులమ్మకు పెద్ద అల్లుడు అని అన్నారు. రవి భార్య పుష్పాంజలితో గొడవపడి విడిపోయారన్నారు. పుష్పాంజలి పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోందన్నారు. రవి తన కూతురికి ఆరోగ్యం బాగాలేదని చూడటానికి గొట్లూరు గ్రామానికి వెళ్లాడని తెలిపారు. ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు నెక్లెస్, డాలర్, నాలుగు జతల కమ్మలు, మరి కొన్ని నగలను ఎత్తుకెళ్లాడని తెలిపారు. ధర్మవరం మండలం నాగలూరు గ్రామ బస్టాప్ వద్ద చందమూరు రవిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అతడి వద్ద 6.5 తులాల బంగారం నగలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగరాజు ఉన్నారు



పట్టుబడిన బంగారం నగలను చూపుతున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

బంగారం గొలుసు అపహరణ

ధర్మవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌లో గుర్తు తెలియని దొంగలు ఓ మహిళ మెడలో నుంచి బంగారం గొలుసును అపహరించారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన రాములమ్మ శారదానగర్‌లో ఉన్న తన బిడ్డ ఇంటికి వెళ్తుండగా ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులు వేసుకుని వచ్చి తన మెడలో ఉన్న 3.5 తులాల బంగారం గొలుసును లాక్కొని పరారయ్యారన్నారు. స్థానికులు సమాచారం అందించడంతో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డెప్ప సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలితో వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

వాహనాల దొంగ అరెస్టు

24 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

గార్లదిన్నె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడిన యువకుడిని అరెస్టు చేసి, 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన యువకుడు శంకర్‌సాయికుమార్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. విలాసవంతమైన జీవితం గడపడానికి అప్పులు చేశాడు. చేసిన అప్పులను తీర్చే క్రమంలో దొంగగా మారాడు. అనంతపురం, కర్నూలు, నంద్యాల తదితర జిల్లాల్లో పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి, బెంగళూరు, బళ్లారి వంటి దూరప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకునేవాడు. ఇటీవల కల్లూరు గ్రామంలోని నీలం సంజీవరెడ్డి సర్కిల్లో ఈడిగ తిరుపాల్ ద్విచక్ర వాహనం చోరీ అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ సమీపంలో ఓ పాడుబడిన రేకుల షెడ్డులో వాహనాలను దాచిపెట్టి అమ్ముకోవడానికి బెంగళూరుకు వెళుతుండగా గార్లదిన్నె పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించి, సుమారు రూ.15లక్షలు విలువ చేసే 24 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు..



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను చూపుతున్న పోలీసులు

టీడీపీ నాయకుడిపై దాడి.. ఐదుగురిపై కేసు

గుంతకల్లు టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలకలపెంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జయరాముడుపై దాడి జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు, మాజీ సర్పంచు రంగమ్మ కుమారుడైన జయరాముడు గుంతకల్లుకు వెళ్లి శుక్రవారం రాత్రి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా.. అదే గ్రామానికి చెందిన దండు శ్రీనివాసులు, తలారి దివాకర్, తలారి సూర్యనారాయణ, తలారి తిక్కస్వామి, తలారి ఉదయ్ కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ విషయాన్ని జయరాముడు తన సోదరుడికి ఫోన్ చేసి తెలిపాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని అతడిని సోదరుడు చికిత్స నిమత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అక్క కుమారులు దాడి చేశారని బాధితుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

రైతు ఇంట్లో చోరీ

గుత్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ వీధికి చెందిన రైతు నాగిరెడ్డి ఇంట్లో దొంగలు పడ్డారు. వ్యవసాయ పనుల నిమిత్తం తన స్వగ్రామానికి భార్య శ్రీదేవితో కలిసి నాలుగు రోజుల క్రితం వెళ్లారు. శనివారం తిరిగి వచ్చేలోగా ఇంట్లోకి చొరబడి 9 తులాల బంగారు ఆభరణాలు, 3 కేజీల వెండిని ఎత్తుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానిన్ని పరిశీలించారు.



చెల్లాచెదురుగా పడిన దుస్తులు

ఖోఖో విజేత ఎస్ఎస్‌జీడీ కళాశాల

ముగిసిన క్రీడా పోటీలు



ఖోఖో జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జెస్సీ, కళాశాల డైరెక్టర్ గోపాల్

గుంతకల్లుటౌన్,నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీల విజేతగా ఎస్ఎస్‌జీడీ (శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ) కళాశాల నిలిచింది. పట్టణంలోని ఎస్ఎస్‌జీడీ కళాశాలలో శనివారం ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పురుషుల గ్రూప్ సీ క్రీడా పోటీలు ముగిశాయి. ఖోఖోలో ఎస్ఎస్‌జీడీ కళాశాల విన్నర్‌గా, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రన్నర్‌గా నిలచింది. హ్యాండ్‌బాల్‌లో తాడిపత్రి నారాయణ బీపెడ్ కళాశాల విన్నర్‌గా, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఫుట్‌బాల్‌లో పుట్టపర్తి మంగళకర జగరాజుపల్లి కళాశాల విన్నర్‌గా, అనంతపురం ఆర్ట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. రగ్బీ పోటీలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల విన్నర్‌గా, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వీరికి ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ జెస్సీ, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గోపాల్ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర్లు, కళాశాల పీడీ మహబుబ్ బాషా, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా..!

ఆంధ్రజ్యోతికి స్పందన

వ్యవసాయ శాఖ ఎంపీఈఓల ఓడీలు రద్దు

ఎట్టకేలకు 106 మంది ఎంపీఈఓలకు విముక్తి

అనంతపురం అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న 106 మంది వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు విముక్తి లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల అవస్థలపై పలు మార్లు 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కూడా అక్కడ పనిచేస్తున్న ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు పంపాలని లేఖలు రాశారు. మరికొందరు ఫోన్ ద్వారా కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల ఓడీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్యలో పనిచేస్తున్న ఎంపీఈఓలను రిలీవ్ చేయాలని ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో తిరిగి వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ ఇక్కడి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. వైసీపీ హయాంలో అవసరం లేకపోయినా అనంత ఉమ్మడి జిల్లా నుంచి 253 మంది వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను ఓడీపై ఉమ్మడి చిత్తూరుకు పంపారు. వీరిలో ప్రస్తుతం 106 మంది అక్కడ ఓడీపై పనిచేస్తున్నారు. మిగతా సిబ్బంది దూర ప్రాంతంలో పనిచేయలేక, ఇతర కారణాలతో ఉద్యోగం వదిలేశారు. ఓడీలు రద్దు కావడంతో అక్కడ పనిచేస్తున్న 106 మంది ఎంపీఈఓలు మరో రెండు రోజుల్లో తిరిగి ఉమ్మడి అనంత జిల్లాకు రానున్నారు.

వైద్యానికి సాయం చేయండి

రాయదుర్గం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన కావలి శైలజ, ప్రభాకర్ దంపతుల కుమారుడు గౌతమ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు పేదవారని, వైద్యానికి సాయం చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వాల్మీకి సంఘం నాయకులు విన్నవించారు. దాతలు కొంత సాయం చేశారని, ఆ సొమ్ము చాలడం లేదని ఎమ్మెల్యేకి తెలిపారు. దీంతో ఆయన ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడారు. మెరుగైన వైద్యం చేయాలని సూచించారు. బాలుడి వైద్యానికి సాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కాశీపురం మాజీ ఎంపీటీసీ కావలి లక్ష్మణ, కావలి రవి, బోయ మల్లికార్జున, ఆర్ఎంపీ వాల్మీకి పవన్‌కుమార్, ఉపాధ్యాయుడు అంజి ఎమ్మెల్యేని కలిశారు.

ఐఐటీలతో జేఎన్‌టీయూ అనుసంధానం

ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు పాటించేలా ఐఐటీలతో జేఎన్‌టీయూ అనుసంధాన ప్రక్రియను చేపట్టామని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీష్‌రెడ్డి జిల్లాకు వచ్చిన సందర్భంగా శనివారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ఇన్‌చార్జ్ వీసీ పలు అంశాలపై చర్చించారు. జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. వారిలో అనేకమంది వర్సిటీ అభివృద్ధికి పలురూపాల్లో సహాయ, సహకారాలందించడం జరుగుతోందని తెలిపారు. జాతీయస్థాయి అధికారిగా ఇస్రో, డీఆర్‌డీఓ, ల్యాబ్స్, ఆర్మీ ఆఫీసర్స్‌తో జేఎన్‌టీయూ విద్యార్థులకు వారానికి ఒకసారి లెక్చర్ ఇప్పించేందుకు కృషి చేయాలని సతీష్‌రెడ్డిని కోరారు. స్టార్టప్ కంపెనీలు, ఐఐటీలతో టైఅప్‌కు సహాయపడాలని కోరారు. వర్సిటీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని సతీష్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, డైరెక్టర్లు సత్యనారాయణ, సుజాత, కిరణ్మయి, వైశాలి గోర్పాడే, సుబ్బారెడ్డి, సురేష్‌బాబు, భానుమూర్తి, ప్రశాంతి, పద్మసువర్ణ, ఈశ్వర్‌రెడ్డి, ఏపీ శివకుమార్, కోఆర్డినేటర్లు శారద, అరుణమస్తాని, అరుణ, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

సంక్షిప్తం

కార్తీక మాస పూజలు



శింగనమలలోని ఆత్మసీతారాములు

శింగనమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక శనివారం పూజలను మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆత్మసీతరాముల దేవాలయం, గోల్కొండ వెంకటరమణ స్వామి, నగరేశ్వరి , దుర్గాంజనేయస్వామి దేవాలయాల్లో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు..

ప్రత్యేక ఓటరు నమోదు

గార్లదిన్నె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్ర మాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ పేర్కొన్నారు. తహసీల్దార్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం కూడా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. మొదటి రోజు 11 మంది కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదేవిదంగా ఓటర్‌కార్డులో మార్పు, చేర్పుల కోసం 10 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

గర్భిణులకు భోజన వసతి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్ గేటు ప్రభుత్వాస్పత్రిలో చెన్నేకొత్తపల్లి పోలీసులు శనివారం గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష మాత్ర అభియాన్‌కి ప్రతి నెల తొమ్మిదో తేదీన గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేస్తాని డాక్టర్ రవీనాయక్ తెలిపారు. వారికి భోజన సౌకర్యాన్ని కల్పిస్తామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపినట్టు వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గోవిందమ్మ, సీహెచ్ఎస్ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకటనారాయణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం

రామగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట పశువైద్యకేంద్రంలో పనిచేస్తూ మృతిచెందిన రవి కుటుంబానికి పశువైద్యసిబ్బంది శనివారం ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబసభ్యులకు డాక్టర్ మౌలాలి రూ.28,500 అందజేశారు. పశువైద్యాధికారులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది, గోపాల మిత్రలు కలిసి సేకరించిన సొమ్మును అందజేశారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామని పశువైద్యాధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన సుబ్బమ్మ, రామకృష్ణ దంపతులు ద్విచక్రవాహనంలో చెన్నేకొత్తపల్లికి వెళ్తున్నారు. జంక్షన్ వద్ద ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వారిద్దరు గాయపడ్డారు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డబ్బు అనవసరంగా ఖర్చు చేస్తున్నాడని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని ఆరో రోడ్డుకు చెందిన ఆంజనేయులు కుమారుడు హేమంత్‌కుమార్(19) పదోతరగతి వరకు చదివి వదిలేశాడు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన హేమంత్‌కుమార్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30 మద్యం బాటిళ్ల పట్టివేత

అనంతపురం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనధికారిక మద్యం విక్రయాలపై అనంతపురం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద శనివారం తాడిమర్రి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 30 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జయనాథ్ రెడ్డి, ఎస్ఐ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ఆత్మకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మదిగుబ్బ గ్రామంతలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అతడు ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మదిగుబ్బ గ్రామంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

సరిగా అందని పశువైద్యం

- ఆస్పత్రిలో అరకొరగానే మందులు
- శిథిలావస్థలో ఆస్పత్రి భవనాలు
- భారీగా నష్టపోతున్న పాడిరైతులు



సీకేపల్లి ప్రాంతీయ పశువైద్యశాల

చెన్నేకొత్తపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల వల్ల వ్యవసాయంతో పాటు ఆ తరువాత అత్యంత ప్రాధాన్యం కల్గిన పశుపోషణ మండలంలోని రైతులకు భారంగా మారింది. దీనికి తోడు పశువులకు వ్యాధులు సోకినప్పుడు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు భారీగా నష్టపోయి, కుటుంబపోషణ కష్టతరంగా మారుతోంది. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం పాడిపరిశ్రమను పూర్తిగా విస్మరించిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా పాడికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

మూడు మండలాల్లో పాడి ప్రధానం

కరువు మండలాలైన రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో గ్రామీణులకు చాలా వరకు పాడి ప్రధాన ఆధారంగా ఉంది. కొన్నేళ్లుగా వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది రైతులు ప్రత్యామ్నాయంగా పాడి రంగం వైపు మళ్లారు. దీంతో మూడు మండలాల్లో లక్షల్లో ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్లు ఉన్నట్టు పశుగణాంకాలు చెబుతున్నాయి. అంతటి ప్రాధాన్యమున్న రంగంలో వైద్యసేవలు అరకొరగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో వైద్యసేవలు అందక పశువులు మృతిచెందుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్నిచోట్ల పర్యవేక్షణ కొరవడి ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

అరకొరగా మందులు - శిథిలావస్థలో భవనాలు

పశువుల ఆస్పత్రులలో చాలా వరకు మందుల కొరత ఉంది. సాధారణ మందులు కూడా ఉండటం లేదు. దీంతో పశువుల వైద్యులు బయట మెడికల్ షాపులకు మందులను రాసిస్తున్నారు. మూడునెలలకొకసారి సరఫరా చేయల్సిన మందులను ఐదారు నెలలకొకసారి చేస్తున్నట్లు సమాచారం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పలు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. అవి ఎప్పుడు కూలుతాయోనన్న భయంతో సిబ్బంది పనిచేస్తున్నారు. పైకప్పులు దెబ్బతిని వర్షాకాలంలో నీరు కారుతుండడంతో మందులు పాడైపోతున్నాయి. చివరికి సీకేపల్లిలోని ప్రాంతీయ పశువైద్యశాల భవనం బాగా దెబ్బతింది. గ్రామీణ వైద్యశాలలైన ఎన్ఎస్ గేటు, మేడాపురం, న్యామద్దల, పేరూరు తదితర ఆస్పత్రి భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కాగా రైతు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తున్న 31 ఆస్పత్రులు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా పాడిపశువులు మరణిస్తే ప్రభుత్వం అందించే పశుబీమా పథకం అటకెక్కింది. గత వైసీపీ పాలనలో ఈ పథకాన్ని పూర్తిగా నీరుగార్చారని. గొర్రెలు, మేకలకు కూడా అందడంలేదని రైతులు అంటున్నారు.



ఎస్ఎస్‌గేటులో పాతమిద్దెలోనే పశువైద్యశాల

పశు బీమా సౌకర్యం కల్పించాలి



వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో పాడిని ప్రధాన జీవనాధారంగా చేసుకున్నాం. నేను రెండు ఆవులను పోషించుకుంటుండగా ఏడాది క్రితం ఉన్నపలంగా మృతిచెందాయి. దీంతో రూ. లక్ష వరకు నష్టపోయా. ఎలాంటి బీమా అందలేదు. ఈ ప్రభుత్వంలో నైనా బీమా సౌకర్యం కల్పించాలి. - భాస్కర్‌రెడ్డి, పాడిరైతు, సీకేపల్లి

ఆవుల మృతితో నష్టపోయా



నాకున్న రెండు ఆవులు ఏడాది క్రితం చనిపోయాయి. ఒక్కొక్కటి రూ.80వేలు విలువ ఉంటుంది. పశువైద్యాధికారులు వచ్చి రిపోర్టు రాసుకున్నారు. అయితే ఇప్పటి వరకు బీమా సొమ్ము అందలేదు.

- చల్లా సోమశేఖర్, రైతు, కనగానపల్లి

మందుల కొరత వాస్తవమే

పశువుల ఆస్పత్రులలో కొంత మేర మందుల కొరత ఉన్నమాట వాస్తవమే. అన్ని రోగాలకు మందుల సరఫరా ఉండదు. దీంతో అప్పుడప్పుడు కొన్ని రోగాలకు బయటకు మందులు రాయాల్సి వస్తుంది. పలు ఆస్పత్రుల్లో పాతగదులు శిథిలావస్థలో ఉన్నాయి. సీకేపల్లి ఆస్పత్రి నూతన భవన నిర్మాణం కోసం రూ.30లక్షలతో ప్రతిపాదనలు పంపాం.

- డాక్టర్ జ్యోతికుమారి, ఏడీఏ వెటర్నరీ, సీకేపల్లి

ఆ అర్హత వైసీపీకీ లేదు

- టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకీ లేదని అనంతపూర్ క్లబ్ సభ్యులు, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి పుట్లూరు లక్ష్మన్న విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ నాయకులు నేడు శాంతి భద్రతల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాల వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాటు స్థాయి, వయస్సు చూడ కుండా వారు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను వారు బూతులు తిట్టడం, దాడులకు పాల్పడడం, ఆర్థికమూలాలను నాశనం చేయడం ఎవరూ మరవలేదని మండిపడ్డారు. అప్పట్లో ప్రభుత్వ సలాహారు అయిన సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణా రెడ్డి సీఎం జగన్‌ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు.

ఘనంగా వాల్మీకి మహర్షిజయంతి



జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్దుర్తి గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి కులస్థుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం రూరల్ పంచాయతీలో వరద బాధితులకు కర్ణాటకు చెందిన జపానందస్వామి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. గత నెలల్లో వచ్చిన వరదలకు పంచాయితీలోని రామకృష్ణ కాలనీ, సుశీలరెడ్డికాలనీ, అభ్యుదయ కాలనీ, నారాలోకేస్ కాలనీల్లో పెద్ద ఎత్తున వరద నీరు చేరి స్థానికంగా ఉన్న ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఈ క్రమంలోనే శనివారం పంచాయతీ కార్యాలయంలో 207 బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. తహసీల్దార్ హరికుమార్, సర్పంచు ఉదయ్‌శంకర్, టీడీపీ రాష్ట్రనాయకులు గంగారామ్, కార్పొరేటర్ హరిత, పంచాయితీ కార్యదర్శి శ్రీధర్ రావు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడిగా పాటిల్



ఎన్నికైన ఏపీజీఈఏ కార్యవర్గం

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ)జిల్లా అధ్యక్షుడిగా పాటిల్ విజయభాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక ఉపాధ్యాభవన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా జూపల్లి రమణకుమార్, కోశాధికారిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటేశులును ఎంపిక చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ...ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివానందరెడ్డి

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్ఎల్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గాండ్లపర్తి శివానందరెడ్డిని ఎంపిక చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోగా అనంతపురం జిల్లా నుంచి పలువురికి అవకాశం కల్పించారు. జిల్లా నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివానందరెడ్డిని, ఉపాధ్యక్షులుగా నరసింహమూర్తి, శచిదేవిని, కార్యదర్శిగా నీలోఫర్ జాన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా హరినాథ్‌ను, లీగల్ కమిటీ సభ్యులుగా కర్రీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు.

చట్టం ప్రకారం నడుచుకోవాలి : అనంత

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చట్టప్రకారం నడుచుకోవడం లేదు.. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టి వేధించే పరిస్థితి కొనసాగితే తీవ్ర పరిణామాలుంటాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అధికారిక ఖాతాల ద్వారా, టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు వివిధ సామాజిక మాధ్యమాల్లో పెడుతున్న పోస్టులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం వైసీపీ నాయకులతో కలిసి అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ మహమ్మద్ వసీం, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించండి

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌జేయూపీ నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాశినేని రామానాయుడు, రాష్ట్ర కార్యదర్శి సొమలూరు బాబు తదితరులు శనివారం డీఈఓ ప్రసాద్‌బాబును ఆయన చాంబర్‌లో కలిశారు. జిల్లాలో అనేక ఉపాధ్యాయ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్, లీడర్ షిప్ ట్రైనింగ్ వల్ల టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ శిక్షణను నాన్ రెసిడెన్షియల్ పద్ధతుల్లో ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా అపార్ నమోదును సచివాలయ సిబ్బందికి అప్పగించాలని, టీచర్లకు బోధనేతర విధులు తగ్గించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

'వదాన్య' ప్రతిభా పరీక్ష పోస్టర్ విడుదల



మాట్లాడుతున్న అశోక్ పడపాటి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల డ్రాప్‌ఔట్ల తగ్గింపు, ప్రైవేట్ పాఠశాలల్లో వలసల నివారణ, ప్రతిభ వెలికితీతే ప్రధాన లక్ష్యంగా డిసెంబరు నెలలో నిర్వహించే ప్రతిభ పరీక్ష, డిసెంబరు 29న కొత్తచెరువులో నిర్వహించే డీఎస్సీ ఎస్జీటీ గ్రాండ్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టరును వెబ్‌సైట్‌నీ వదాన్య ఫౌండర్, వదాన్య బృందం ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం ఆ సొసైటీ కార్యాలయంలో ఫౌండర్ అశోక్ పడపాటి వివరాలు వెల్లడించారు. పరీక్ష నిర్వహణ కోసం సంబంధించిన సమాచారం తెలియజేయడానికి గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కొత్తచెరువు ప్రధాన పరీక్షా కేంద్రంగా పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం అందించే ఈ పరీక్షను డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులందరూ వినియోగించుకోవాలన్నారు. పరీక్షకు సంబంధించిన వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. కేవలం రెండు వేల మందికి మాత్రమే ఈ పరీక్షలో పాల్గొనడానికి ఉందన్నారు. హాల్ టికెట్లను నమోదు చేసుకున్న వివరాల ప్రకారం వారి వారి వాట్సాప్‌లకు లేదా ఈమెయిల్‌కు పూర్తి వివరాలను తెలుసుకోవడం వదాన్య సొసైటీని ఫాలో కావాలన్నారు.

18న సచివాలయాల వద్ద అర్జీల స్వీకరణ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాల వద్ద సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి అర్జీలు స్వీకరిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఆ పట్టాలు, స్థలాలు నివాస యోగ్యంగా లేని ప్రాంతాల్లో ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరారు. రైతులకు సబ్సిడీ, పెట్టుబడి సాయం అందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి 18న అర్జీల స్వీకరణ, 20వ తేదీ నుంచి 30 వరకూ విద్యుత్ చార్జీలపై ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, నాయకులు లింగమయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో జమిలి ఎన్నికలు అసాధ్యం : ఓబులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో జమిలి ఎన్నికలు (ఒకే దేశం - ఒకే ఎన్నిక) అనేది సాధ్యం కాని అంశమని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు శనివారం అనంతపురం రూరల్ పంచాయతీలోని జేఎన్‌టీయూ రోడ్డులో ప్రజా పోరుయాత్ర కార్యక్ర మాన్ని ప్రారంభించారు. జేఎన్‌టీయూ మెయిన్‌రోడ్డు, రామకృష్ణకాలనీ మీదుగా కార్యక్రమం సాగింది. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఓబులు హాజరై మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డీఏ పా లనలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వాటి తగ్గుదలకు ఎలాం టి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాగే పెట్రోలు, డీజల్ ధరలు తగ్గలేదన్నారు. నిరుద్యోగ సమస్యగా విపరీతంగా పెరిగిందన్నారు. వీటిని పక్కదారి పట్టించడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జమిలి ఎన్నికలనే కొత్త నినాదం తెస్తోందన్నారు. అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంటు బిల్లుల్లో ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, న్యూకమిటీ కార్యదర్శి ఆర్‌వినాయుడు, కార్యవర్గ సభ్యులు ముర్తుజా, ఇర్ఫాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను నిరసించాలి

అనంతపురం కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ నిరసించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజాపోరు యాత్ర రెండోరోజున శనివారం 49వ డివిజన్ పరిధిలోని ఇందిరా గాంధీ నగర్, ముత్యాలమ్మ కాలనీ, ఆర్కే నగర్, ఎస్సీ కాలనీ, సీపీఎం కాలనీ, గౌరవ్ గార్డెన్స్‌లలో సాగింది. ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సావిత్రితో పాటు సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, నగర నాయకులు నూరుల్లా, మసూద్, ఎన్టీఆర్ శీన, ఐద్వా నాయకురాలు చంద్రిక, పర్వాది, సునంద, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే పరిటాల సునీత



టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు వల్ల ఉప యోగాల గురించి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు విస్తృతంగా తెలియ జేసి, మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. ఆమె శనివారం స్వగ్రామమైన వెంకటాపురంలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను, టీడీపీ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. సభ్యత్వనమోదు తీసుకుంటే రూ.5లక్షల వరకు బీమా ఉంటుందన్నారు. సహజ మరణాలు జరిగితే మట్టి ఖర్చులకు రూ.10వేలు, కుటుంబంలో పెద్దకు ఇబ్బంది కలిగితే వారి పిల్లల చదువులు, ఉద్యోగాల బాధ్యత ఎన్టీఆర్ ట్రస్టు తీసుకుంటుందన్న అంశాలపై వివరించాలన్నారు. టీడీపీ కార్యకర్త అంటే సమాజంలో గౌరవం ఉందని, మనం అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా కనగానపల్లి మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ రిజ్వాన్ ఎమ్మెల్యే పరిటాలసునీతను శనివారం కలిశారు. విధి నిర్వహణలో పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఆమె ఎస్ఐకి సూచించారు.

కందిపంటను పరిశీలించిన ఎమ్మెల్యే

రామగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం స్వగ్రామ మైన వెంకటాపురం పొలాల్లో రైతులు సాగు చేసిన కందిపంటను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. 25వేల ఎకరాల వరకు నియోజకవర్గంలో కందిపంట సాగుచేశారని, వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పొలాల్లో పర్యటిస్తూ రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

శింగనమల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదు ద్వారా టీడీపీ కార్యకర్తలకు భరోసా వస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.బోయ సత్తి , నానేసాబ్, జడేజా, పాపన్న, ప్రకాశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కనగానపల్లి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పీడీ

కనగానపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు కనగానపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి మనోహర్ ఎంపికైనట్టు పీడీ రమేశ్ తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలు అనంతపురంలో జరిగాయి. వీటిలో మనోహర్ ప్రతిభ కనబరిచాడు. గుంటూరులో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని పీడీ తెలిపారు. ఆ విద్యార్థినిని పీడీతో పాటు పాఠశాల హెచ్ఎం అబ్బాస్ అభినందించారు.

అప్పర్‌పెన్నార్ డ్యాం పరిశీలన

రామగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు అప్పర్ పెన్నార్ డ్యాంను ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు కలిసి శనివారం పరిశీలించారు. వైసీపీ పాలనలో గేట్లు ఎత్తేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అవగాహన లోపం వల్ల వాటిని విరగొట్టారని టీడీపీ నాయకులు అన్నారు. దీనిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఉన్నతాధికారులతో మాట్లాడారన్నారు. జరిగిన నష్టంపై రూ.1.20కోట్లు మంజూరు చేయించారని, దీంతో దెబ్బ తిన్న గేట్లను ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీదర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తగా న్యాయవాద వృత్తి ఆరంభించే దశలో, కక్షిదారులకు అందించాల్సిన సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఇంటికే నల్లప్ప, ప్యానల్ లాయర్స్, లేబర్ ఆఫీస్ అధికారులు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కాలవ

డీ.హీరేహాళ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలో శనివారం ఆయన పర్యటించి పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. తొలుత కాదలూరు గ్రామంలో రూ. 3.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం అక్కడే టీడీపీ సభ్యత్వ నమోదుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడపడం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అందుకే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం ప్రజల సంక్షేమానికి తీవ్ర కృషి చేస్తున్నారని తెలిపారు. చెప్పిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ.. వాటి ఫలాలు ప్రతి లబ్ధిదారుడికి అందేలా పాలన సాగిస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదును భారీఎత్తున చేయాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. సభ్యత్వం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తర్వాత మల్లికేతి గ్రామంలో రూ. 1.15 కోట్ల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణానికి, హులికల్లులో రూ. 85 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గంగాధర, డీఈ సుధాకర్‌నాయక్, ఏఈ సుధాకర్ ఆయా గ్రామాల సర్పంచులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు

డీ.హీరేహాళ్ మండలం మల్లికేతికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు అంగడి రంగమ్మ ఆమె భర్త అంగడి గోవిందు ఇతర కుటుంబసభ్యులు టీడీపీలోకి చేరారు. గ్రామంలోకి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రావడంతో ఆయన సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోని ఆహ్వానించారు.

ఫారంపాండ్లతో భూగర్భజలాల పెంపు: ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఫారం పాండ్లతో భూగర్భజలాలను పెంపొందుతాయని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని గోళ్ల గ్రామానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రూ. 6.36 కోట్ల నిధులతో వాటర్ షెడ్ పనులు మంజూరయ్యాయి. అందులో ఫారం పాండ్ పనులను శనివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వాటర్‌షెడ్ పథకంలో తవ్వి న ఫారమ్‌పాండ్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దీని ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. వచ్చే యేడాది మార్చి నాటికి ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫారమ్‌పాండ్‌ల నిర్మాణానికి రూ. 3 కోట్లు, వివిధ వ్యవసాయ పనిముట్ల మంజూరకు రూ. 2 కోట్లు, మహిళా సంఘాల జీవనోపాధికి రూ. 92 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. గోళ్ల గ్రామం అభివృద్ధి పథంలో నడవాలని అన్నారు. వాటర్ షెడ్ కమిటీ చైర్మన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


వాటర్‌షెడ్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

టీడీపీలోకి చేరిక..

కళ్యాణదుర్గం మండలం గోళ్ల పంచాయతీకి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు ఓబయ్య టీడీపీలోకి చేరారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఆయన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఓబయ్యకు ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, నాయకుడు చంద్ర పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాడిపత్రి/పెద్దపప్పూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీకమాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఏటిగడ్డ ఆంజనేయస్వామి, సత్యాంజనేయస్వామి, అభయాంజనేయస్వామి , పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో వేకువజామునే అర్చనలు మూలవిరాట్‌లకు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. అలాగే పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, చిన్నపప్పూరు సమీపంలోని అశ్వత్థ నారాయణస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజ లు వైభవంగా నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో ఏటిగడ్డ ఆంజనేయస్వామి

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, ముసలిరెడ్డి, పీసీసీ మాజీ సభ్యుడు గాలిమల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆలూరు రోడ్డులో శనివారం వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జిలు పెంచి ప్రజల నెత్తిన అదనపు భారం మోపడంతగదన్నారు. ఇప్పటికైనా పెంచిన చార్జీలు తగ్గించాలన్నారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామ ని హెచ్చరించారు. అనంతరం ఏడీఈకు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఆలం నవాజ్, గుల్బరోష్, జిలాన్, మోహన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ సభలను విజయవంతం చేయండి

గుంతకల్లుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహా సభలు విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయని, విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన ప్రతిఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్, నాయకులు రోహిత్, సమీర్, లక్ష్మణ్, రెహనా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

బొమ్మనహాళ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్లుదేవనహళ్లి, బండూరు గ్రామాల నడుమ రోడ్డు, కల్వర్టు ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఆ రోడ్డు, కల్వర్టును తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు శనివారం పరిశీలించి మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ. 40లక్షల వ్యయంతో ప్రతిపాదన వేయించి రోడ్డు పనులు మొదలు పెట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అందుకే పనులు ప్రారంభించామని, అతి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

గుత్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.కాశీవిశ్వనాథచారి సూచించారు. పట్టణంలోని ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో శనివారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయం పట్ల, కోర్టుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజీ అయ్యే కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. డిసెంబరు 14న జాతీయ లోక్‌ఆదాలత్‌లో అత్యధికంగా కేసులను పరిష్కరించే విధంగా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరో అదనపు కోర్టు సూపరింటెండెంట్లు నరసింహారెడ్డి, జ్యుడీషియల్, సీనియర్ సివిల్ కోర్టుల సూపరింటెండెంట్లు మునియమ్మ, గీతావరలక్ష్మి, పీపీ సుధీర్‌రెడ్డి, ఏజే పీ. తిమ్మారెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌శర్మ, ఉపాధ్యక్షుడు పీడీ రత్నం, సెక్రెటరీ చంద్రశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి కేశవ్‌పై విమర్శలు విడ్డూరం

ఉరవకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌పై వైసీపీ నాయకులు చేసిన విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు పేర్కొన్నారు. వజ్రకరూరు మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాగునీటి సమస్యను మంత్రి కేశవ్ పట్టించుకోలేదని వైసీపీ ఎంపీటీసీ సభ్యులు పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కూలీగా పనిచేస్తున్న మంత్రిని విమర్శించడం తగదన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు ఏమి అభివద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాంటి మంత్రిపై విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకులు నాగేంద్ర, ఎం.నారాయణ స్వామి, దస్తగిరి, కాశీం, నజీర్, సర్పంచ్‌లు సుదీప్, మనోహర్, బూత్ కన్వీనర్లు గణేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణ తరగతులు

బొమ్మనహాళ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 12 నుంచి 13వ తేదీ వరకు మండల, గ్రామ స్థాయి అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాస్ నాయక్, ఈఓపీఆర్డీ దాస్ శనివారం విలేకరులకు తెలిపారు. ఇందులో గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. 12న అధికారులకు, 13న ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు జరుగుతాయని అన్నారు. అందరూ హాజరు కావాలని కోరారు.

రామాలయ అర్చకుడి మృతి

బెళుగుప్ప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న గ్రామంలో రామాలయ అర్చకుడు పద్మనాభరావు శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన అర్చకత్వం చేస్తూనే.. టీడీపీలో క్రియాశీలకంగా పని చేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ రాము తెలిపారు. అర్చకుడి మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల నాకాబందీ

తాడిపత్రి/ పుట్లూరు/ పెద్దవడుగూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామంలో శనివారం రూరల్ ఎస్‌ఐ ధరణీబాబు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో, గడ్డివాముల్లో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలం శనగలగూడూరులో సీఐ సత్యబాబు, ఎస్‌ఐ హేమాద్రి, యల్లనూరు ఎస్‌ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. ఇక పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లిలో ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బందితో కలిసి నాకాబందీ చేపట్టారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

బ్రహ్మసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చిత్తప్ప అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, మాజీ కన్వీనర్ రాజశేఖర్ గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయ చౌదరి కూడా నివాళులర్పించారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని యల్లనూరు రైల్వేగేట్ వద్ద నారాయణస్వామి (52) అనే వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన నారాయణస్వామి కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ముగ్గురు కుమార్తెలకు అప్పులు చేసి వివాహాలు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది శనివారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య అనసూయ, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

పశువులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

పెద్దవడుగూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి ఓ కంటైనర్‌లో పశువులను పరిమితికి మించి అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు కొందరు గమనించి పట్టుకున్నారు. అనం తరం మండలకేంద్రంలోని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వచ్చి ఆ కంటైనర్‌ను మండలకేంద్రానికి తరలించారు. వాటిని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

బెళుగుప్ప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవర్తిలో శనివారం నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. ఈ దాడులలో 400 లీటర్ల సారా ఊటతో పాటు తయారీ సామగ్రిని పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని తయారీదారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటరెడ్డిపల్లి క్రాస్ వద్ద..

తాడిపత్రి: మండలంలోని వెంకటరెడ్డిపల్లి క్రాస్ వద్ద శనివారం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బూరుగలకు చెందిన కంబగిరిస్వామిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 8.8లీటర్ల నాటుసారాను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. నాటుసారాను రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి అతడిని అరెస్టు చేశామని అన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయాలు జరిపితే 9440902556కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

కాలువ స్థలం పరిశీలన

పుట్లూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మనమల గ్రామం నుంచి యల్లనూరు మండలం బొప్పేపల్లి చెరువుకు నీరు పోవడానికి ఉన్న కాలువను ఆర్డీఓ గుత్తా కేశవనాయుడు శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాలువ పూర్తిగా విస్తీర్ణం ఉండడం వల్ల పుట్లూరు, యల్లనూరు మండలాల ప్రజల తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. కాలువ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, సర్వేయర్ శాంతి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బళ్ళారికి చెందిన మురళీకృష్ణ అనే యువకుడు బైకుపై పెద్దవడుగూరు మండలం చిట్టూరుకి బంధువుల ఇంటికి బయలుదేరాడు. శ్రీపురం గ్రామశివారులోకి రాగానే బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పప్పుశనగ పంట పరిశీలన

యాడికి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్. కొత్తపల్లి గ్రామంలో పప్పుశనగ పంట పొలాలను ఏఓ మహబూబ్‌బాషా శనివా రం పరిశీలించారు. పప్పుశనగకు వేరుకుళ్లు అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఏఓ మహబూబ్‌బాషా ఎన్. కొత్తపల్లి గ్రామంలోని పప్పుశనగ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులతో పప్పుశనగలో తెగుళ్లపై ఆరాతీశారు. ప్రస్తుతం ఎండు తెగులు(వేరుకుళ్ల తెగులు) సోకి పంట ఎండిపోతున్నదని తెలిపారు. ఎండు తెగులు వ్యాప్తిచెందకుండా ప్రొపికొనసోల్ లేదా టూబికొనజోల్ రెండు మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ అధికారి రమేష్ ఉన్నారు.


పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ



ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోండి

కణేకల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా జనవరి 1 2025 నాటికి 18 ఏళ్ల వయసు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఫణికుమార్ శనివారం ప్రకటనలో కోరారు. మండలంలోని అన్ని బూత్‌లలో ఆదివారం రెవెన్యూ అధికారులు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. నూతన ఓటర్ల నమోదుతో పాటు చనిపోయిన, గ్రామం వదిలి వెళ్లిన వారి వివరాలు, ఓటరు కార్డుల్లో మార్పులు, చేర్పులు ఉన్నా.. సవరిస్తామని పేర్కొన్నారు. కనుక ప్రత్యేక నమోదును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదును తహసీల్దార్ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందన్నారు. వినియోగించుకోవాలని తెలిపారు. డీటీ సుజాత, బీఎల్వోలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం కూడా ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు.

యాడికి: మండలంలో 53వ పోలింగ్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

గౌడ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలి

రాయదుర్గం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌడ లేఅవుట్‌లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు వెంటనే వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. గౌడ లేఅవుట్‌లో శనివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు లేవని ప్రజలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విషయం తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మధు, తిమ్మరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొళగానహళ్లి గ్రామంలో టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదును శనివారం జోరుగా చేపట్టారు. సీనియర్ నాయకుడు ప్రభాకర్‌నాయుడు దాదాపు 100 మందితో సభ్యత్వ నమోదు చేయించారు. నాయకులు రమేష్, ప్రభాకర్, సిద్ధలింగస్వామి తదితరలు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 9వ వార్డులో మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు గోవిందు, హనుమేష్, రవికుమార్, కిషోర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

24న కనకదాస విగ్రహావిష్కరణ

గుంతకల్లుటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీరప్ప సర్కిల్లో ఏర్పాటు చేసిన కనకదాస కాంస్య విగ్రహాన్ని ఈనెల 24వ తేదీన ఆవిష్కరించనున్నట్లు కురుబ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. స్థానిక బీరప్ప ఆలయంలో శనివారం కురుబ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కురుబలు ఈనెల 18వ తేదీన బీరప్ప ఆలయం వద్దకు రావాలన్నారు. అక్కడ నుంచి అనంతపురంలో జరిగే కనకదాసు జయంతికి వెళదామన్నారు. అలాగే గుంతకల్లులో 24వ తేదీ జరిగే కనకదాసు విగ్రహా ఆవిష్కరణకు జిల్లా వ్యాప్తంగా కురుబలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుబలు పూజారి మందాలప్ప, జడ్పీటీసీ కదిరప్ప, జిల్లా సాధికార సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, కనకపీటి రామప్ప, పాలమల్లికార్జున పాల్గొన్నారు.

పూల నాగరాజు నియామకంపై హర్షం

గుమ్మఘట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జెడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్‌గా నియమితులవడంపై టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ పూల నాగరాజు రెండు సార్లు గుమ్మఘట్ట జడ్పీటీసీగా, మూడేళ్లు జెడ్పీ చెర్మన్‌గా పని చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబు ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. మండలకేంద్రంతో పాటు రంగచేడు, నేత్రపల్లి, కలుగోడు, తాళ్లకెర, భూపసముద్రం, గొల్లపల్లి గ్రామాల్లో స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్‌లు మోహన్‌రంగా, రంగస్వామితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



